

వలసదారులూ వెళ్లిపోండి...!

వందలాది మంది కార్మికులు విజిట్ వీసాపై మలేషియా వెళ్లారు. అక్కడి ప్రభుత్వం తిరిగి వెళ్లిపోవాలని ఆంక్షలు విధించడంతో వారు ఆందోళన చెందుతున్నారు. 8లో▸



నేడు ట్రిపుల్ ఐటీ నోటిఫికేషన్

ట్రిపుల్ఐటీలో ప్రవేశాలకు బుధవారం నోటిఫికేషన్ విడుదల కానుంది. రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో నోటిఫికేషన్ విడుదలకు ఏర్పాట్లు పూర్తిచేశారు. 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
32.5 /27.5

వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. అల్పపీడనం ప్రభావంతో చాలా ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

30న అర్హుల ఎంపిక శిబిరం

ఆసిఫాబాద్అర్బన్: తిర్యాణి మండల కేంద్రంలోని రాయిసెంటర్‌లో అలింకో సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగులకు పరికరాల పంపిణీ చేసేందుకు ఈ నెల 30న అర్హుల ఎంపిక శిబిరం నిర్వహిస్తున్నట్లు జిల్లా దివ్యాంగుల సంక్షేమశాఖ అధికారి భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. కేవలం తిర్యాణి మండలానికి చెందిన దివ్యాంగులు మాత్రమే ఉదయం 10 గంటలకు రాయిసెంటర్‌లో అన్ని ధ్రువపత్రాలతో హాజరు కావాలని సూచించారు.

30న మినీ జాబ్‌మేళా

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్‌లో ఈ నెల 30న ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం వరకు మినీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీవిజయ బయో ఫర్టిలైజర్‌లో 25 ఉద్యోగాల భర్తీకి ఇంటర్ ఉత్తీర్ణత, పేటీఎంలో 50 సేల్స్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలకు పదో తరగతి ఉత్తీర్ణత సాధించి ఉండాలన్నారు. ఆసక్తి గల యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 94405 14962, 95027 86438 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపాలి



రన్నింగ్ చేస్తున్న విద్యార్థులు

ఆసిఫాబాద్‌రూరల్: రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా విద్యార్థులు ప్రతిభ చూపాలని డీఎస్‌వో మీనారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాల మైదానంలో మంగళవారం జిల్లాస్థాయి అథ్లెటిక్స్ సబ్ జూనియర్ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ ఎంపిక పోటీలకు 50 మంది విద్యార్థులు హాజరయ్యారు. అండర్‌- 8, 10, 12 విభాగాల్లో మొత్తం 24 మంది బాలబాలికలను రాష్ట్రస్థాయికి ఎంపిక చేసినట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శంకర్ తెలిపారు. జూన్ 1న హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కోచ్‌లు అరవింద్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు, అటవీ అధికారుల మధ్య వాగ్వాదం



గ్రామస్తులతో మాట్లాడుతున్న అధికారులు

చింతలమానెపల్లి(సిర్పూర్): మండలంలోని డబ్బా గ్రామంలో మంగళవారం అటవీశాఖ అధికారులు, రైతులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. గ్రామ శివారులో పోడు భూములు స్వాధీనం చేసుకోవడానికి అటవీ శాఖ అధికారులు వస్తున్నారనే సమాచారంతో రైతులు భూముల వద్దకు చేరుకుని అధికారులను అడ్డుకున్నారు. పోడు భూములు 50 ఏళ్లుగా సాగు చేసుకుంటున్నామని వారికి వివరించారు. ఎఫ్ఆర్వో ఇక్బాల్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారమే అటవీ భూమి స్వాధీనం చేసుకుంటున్నామని తెలిపారు. పోడు పట్టాలు ఉన్న ఆదివాసీల భూములను ముట్టుకోమని స్పష్టం చేశారు. ఒక దశలో రైతులు, అధికారుల మధ్య వాగ్వాదం తీవ్రస్థాయికి చేరుకుంది. అనంతరం ఫారెస్టు అధికారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

పట్టణ పేదలకు 'ఉపాధి' పనులు కల్పించాలి



మాట్లాడుతున్న ఆనంద్‌కుమార్

రెబ్బెన(ఆసిఫాబాద్): పట్టణ ప్రాంత పేదలకు ఉపాధిహామీ పనులు కల్పించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ ముంజం ఆనంద్‌కుమార్ అన్నారు. మండలంలోని రాంపూర్‌లో మంగళవారం ఉపాధి హామీ కూలీలను కలిసి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ కూలీల వేతన బకాయిలు వెంటనే విడుదల చేయాలని, కూలీలకు రోజుకు రూ.600, ఏడాదికి 200 పనిదినాలు కల్పించాలనే డిమాండ్‌తో ఈ నెల 30న కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. కూలీలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు చాపిడి పురుషోత్తం, శ్రావణి, కూలీలు పాల్గొన్నారు.

తొలకరికే దారి తిప్పలు

• వర్షాలకు వాగుల్లో మొదలైన వరద • తెగిన తాత్కాలిక వంతెనలు • రాకపోకలకు ఇబ్బందులు

జిల్లాలోని వాగుల్లో తొలకరి వానలకే వరద మొదలైంది. వేసవిలో తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న మట్టిదారులు, వంతెనలు కొట్టుకుపోతున్నాయి. వర్షాకాలం ప్రారంభానికి ముందే జిల్లాలోని పలు గ్రామాలకు రహదారి కష్టాలు ప్రారంభమయ్యాయి. ఏళ్లుగా వంతెనల నిర్మాణాలు పూర్తికాకపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు.

గుండివాసుల గోస



ఇటీవల వర్షానికి గుండి వాగులో తెగిన తాత్కాలిక వంతెన

సాక్షి ఫోకస్

ఆసిఫాబాద్‌రూరల్: ఆసిఫాబాద్ మండలంలోని గుండి వాగుపై వంతెన నిర్మాణం దశాబ్దాలు గడుస్తున్నా పూర్తికావడం లేదు. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు తాత్కాలిక వంతెన తెగిపోయింది. గ్రామస్తులకు రవాణా కష్టాలు మళ్లీ మొదలయ్యాయి. మొదట గుండి వంతెన నిర్మాణానికి 2006లో రూ.3.60 కోట్ల అంచనాలతో శంకుస్థాపన చేశారు. పిల్లర్ దశ వరకు పనులు చేపట్టారు. ఆ తర్వాత పిల్లర్ల ఎత్తు పెంచాలని 2024లో రూ.3.25 కోట్లతో టెండర్లు మళ్లీ పిలిచారు. టెండర్ ప్రక్రియ పూర్తయినా పనులు నెమ్మదిగా సాగుతున్నాయి. వంతెన కోసం 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలను బహిష్కరిస్తామని గ్రామస్తులు కలెక్టరేట్ ఎదుట నిరసన సైతం తెలిపారు. జిల్లా కేంద్రానికి కేవలం మూడు కిలోమీటర్ల దూరంలో గుండి గ్రామం ఉంది. వాగు ఉప్పొంగితే దుబ్బగూడ, కోమటిగూడ నుంచి 30 కిలోమీటర్లు తిరిగి ఆసిఫాబాద్ పట్టణానికి చేరుకోవాల్సి ఉంటుంది. ఏటా వర్షాకాలంలో విద్యార్థులు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా పనులు పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అసంపూర్తిగా 'అప్పపల్లి'



పునాది దశలోనే అప్పపల్లి వంతెన

ఆసిఫాబాద్ మండలం అప్పపల్లి వాగుపై 2024 ఏప్రిల్‌లో రూ.1.86 కోట్లతో వంతెన పనులు ప్రారంభించారు. పునాది దశలోనే నిలిచి ఏడాది గడుస్తున్నా మళ్లీ ప్రారంభించలేదు. వర్షాలకు అప్పపల్లి, ఆర్ఆర్ కాలనీవాసుల ఇబ్బందులు పడుతున్నారు. అంకుసాపూర్‌కు వెళ్లే దారిలోని వాగుపై వంతెన ఎత్తు తక్కువ ఉండటంతో వరద వంతెన పైనుంచి పారుతోంది. సుమారు 15 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి. గతేడాది వంతెన తెగిపోవడంతో తాత్కాలికంగా ఏర్పాట్లు చేసుకున్నారు. 2023లో అదే గ్రామానికి చెందిన బాలుడు వాగులో పడిపోవడంతో అతడిని రక్షించే క్రమంలో మరో వ్యక్తి మృతి చెందాడు.

ఏళ్లుగా పిల్లర్ల దశలోనే..



ఇటీవల కురిసిన వర్షాలకు కొట్టుకుపోయిన తాత్కాలిక వంతెన

వాంకిడి(ఆసిఫాబాద్): వాంకిడి మండలం ఖమాన, కనర్‌గాం మీదుగా కాగజ్‌నగర్ వెళ్లే రహదారిలోని వాగుపై 2006లో వంతెన నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. నాటి నుంచి పలుమార్లు కాంట్రాక్టర్లు మారుతున్నా పనులు మాత్రం పూర్తికావడం లేదు. పిల్లర్ల దశలోనే ఆగిపోయాయి. 2023లో కురిసిన భారీ వర్షాలకు వరద ఉప్పొంగి వంతెన కోసం నిర్మించిన పిల్లర్ల పైనుంచి ప్రవాహం వెళ్లింది. వంతెన నిర్మాణంలో మార్పు కోసం ఇంజినీరింగ్ అధికారులు కొత్త ప్రతిపాదనలు రూపొందించారు. దానికి అనుగుణంగా మళ్లీ పనులు చేపట్టేందుకు టెండర్ వేశారు. టెండర్ ప్రక్రియ పూర్తయినట్లు అధికారులు అప్పట్లో వెల్లడించారు. కానీ ఇప్పటికీ కదలిక కనిపించడం లేదు. ఏటా వర్షాకాలం ముగిసిన తర్వాత నందూప, చోర్‌పల్లి గ్రామస్తులు సొంతంగా రూ.వేలు ఖర్చు చేసి తాత్కాలికంగా వంతెన ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఆ వంతెన తెగిపోయింది. వాంకిడి మండల కేంద్రంలోని ప్రజలు ఖమాన, కనర్‌గాం, చోర్‌పల్లి, నందూప, అంకుసాపూర్ మీదుగా కాగజ్‌నగర్ పట్టణానికి వెళ్లాలంటే 20 కిలోమీటర్ల దూరం మాత్రమే ఉంటుంది. అదే ఆసిఫాబాద్ మీదుగా వెళ్లాలంటే దాదాపుగా 40 కి.మీ.లు ప్రయాణించాలి.



అసంపూర్తిగా వంతెన నిర్మాణం

అనార్‌పల్లి వాగులో వరద



అనార్‌పల్లి వాగు దాటుతున్న ప్రజలు

కెరమెరి(ఆసిఫాబాద్): గత వారంలో రెండు రోజులపాటు కురిసిన వర్షాలకు మండలంలోని అనార్‌పల్లి వాగులో వరద మొదలైంది. మళ్లీ మంగళవారం సైతం వర్షం పడటంతో అవతలి వైపు ఉన్న కరంజివాడ, పెద్ద కరంజివాడ, జన్కాపూర్, బోరిలాల్‌గూడ, శంకర్‌గూడ తదితర పది గ్రామాలకు చెందిన ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వర్షాలకు తాత్కాలిక వంతెన సైతం కొట్టుకుపోవడంతో బైక్‌లు కూడా వెళ్లడం కష్టంగా మారింది. ప్రతీ అవసరానికి కెరమెరి మండల కేంద్రానికి వెళ్లాల్సి ఉండగా, మే నెలలోనే వరద రావడంతో ప్రజలకు ఇబ్బందులు మొదలయ్యాయి.

40 కి.మీ.లు తిరిగి వెళ్లాలి



మా గ్రామం నుంచి నందూప మీదుగా కాగజ్‌నగర్ 20 కి.మీ.లు మాత్రమే ఉంటుంది. పని నిమిత్తం కాగజ్‌నగర్ పట్టణానికి వెళ్లాలంటే వాంకిడి, ఆసిఫాబాద్ మీదుగా 40 కి.మీ.లు తిరిగి వెళ్లాలి. వర్షాకాలం అనంతరం తాత్కాలిక వంతెన ఉండటంతో ప్రయాణం సులువవుతుంది. ప్రజాప్రతినిధులు దృష్టి సారించి శాశ్వత వంతెన నిర్మాణం పూర్తిచేయాలి.

– నగోషె కేశవ్‌రావు, దుబ్బగూడ, మం.వాంకిడి

కష్టాలు ఎప్పుడు తీరుతాయో..



మా ఊరికి వెళ్లాలంటే వాగుపై వంతెన లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. వర్షాకాలంలో చిన్నవానకే వాగు ఉప్పొంగుతుంది. ఎటూ వెళ్లలేని పరిస్థితి నెలకొంటుంది. వంతెన పనులు ప్రారంభించి 19 సంవత్సరాలు అవుతున్నా పనులు మాత్రం పూర్తి కాలేదు.

– రవి, గుండి, మం.ఆసిఫాబాద్

చొరవ చూపాలి



వంతెన నిర్మాణ పనులు జరగడం లేదు. కాంట్రాక్టర్ పిల్లర్ ఎత్తు వరకు పనులు చేసి అసంపూర్తిగా వదిలేశాడు. ఉన్నతాధికారులు చొరవ తీసుకోవాలి. వంతెన పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలి.

– రవీందర్, మాజీ ఎంపీటీసీ

వంతెన నిర్మించాలి



అనార్‌పల్లి వాగుపై వంతెన నిర్మించాలని ఏళ్లుగా అధికారులను వేడుకుంటున్నాం. గతంలో నిధులు మంజూరు కాగా, పనులు సైతం ప్రారంభించారు. కానీ అర్ధంతరంగా ఆగిపోయాయి. జూన్ ప్రారంభం కాకముందే వర్షాలు పడుతున్నాయి. ఈ ఏడాది కూడా ఇబ్బందులు తప్పేలా లేవు.

– కుమురం బొజ్జు పటేల్, కరంజివాడ, మం.కెరమెరి

'సిర్పూర్' అభివృద్ధికి కృషి

• ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు

కాగజ్‌నగర్‌టౌన్: అసెంబ్లీలో ప్రజల సమస్యలు లేవనెత్తి, సిర్పూర్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే హరీశ్‌బాబు అన్నారు. పట్టణంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రెండు రోజుల క్రితం చింతలమానెపల్లి మండలం డబ్బా గ్రామంలో తనపై మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప వ్యాఖ్యలు చేశారని అన్నారు. పదేళ్లపాటు 10 నుంచి 20 కిలోల ధాన్యం కటింగ్ చేయించి అక్రమంగా సంపాదించారని, సిర్పూర్ పేపరు మిల్లును వాడుకుని కార్మికులను నట్టేట ముంచారని, గుర్తింపు సంఘం ఎన్నికల గురించి ఆలోచించలేదని ఆరోపించారు. కొండపల్లిలో రెండు వేల ఎకరాలు, డబ్బా గ్రామంలో రెండు వేల ఎకరాల చొప్పున వేల ఎకరాల్లో ఫారెస్టు అధికారులు మొక్కలు నాటారని, దీనికి బాధ్యత ఆనాడు అధికారంలో ఉన్న కోనేరు కోనప్పది కాదా అని ప్రశ్నించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత ప్రాజెక్టు నిర్మిస్తామని స్పష్టం చేశారు. కోనప్ప అసలు ఏ పార్టీలో ఉన్నాడో... ఏ పార్టీలోకి వెళ్లాలో తేల్చుకోలేని పరిస్థితిలో ఉన్నారని ఎద్దేవా చేశారు. అభివృద్ధిని సహించలేక ఆయన అసహనానికి గురవుతున్నారని అన్నారు. సమావేశంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు శివ, జిల్లా కోశాధికారి అరుణ్ లోయ, అసెంబ్లీ కన్వీనర్ గొల్లపల్లి వీరభద్రచారి, మాజీ జెడ్పీటీసీ నీరటి సత్యనారాయణ, మాజీ ఎంపీపీ మనోహర్ గౌడ్, తిరుపతి, కుమారస్వామి, తిరుపతి, సదానందం తదితరులు పాల్గొన్నారు.

అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలి



వీసీలో పాల్గొన్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, అధికారులు

ఆసిఫాబాద్అర్బన్: ప్రజల సంక్షేమం కోసం అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని, కలెక్టర్లు అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పనుల పురోగతిని పర్యవేక్షించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి రాష్ట్ర మంత్రులు, ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో ధాన్యం కొనుగోళ్లు, వ్యవసాయం, భూభారతి చట్టం, ఇందిరమ్మ ఇళ్లు, ఇతర అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. సీఎం మాట్లాడుతూ గతంతో పోల్చితే ఈ ఏడాది వరి ధాన్యం సేకరణ అధికంగా జరిగిందన్నారు. భూభారతి చట్టంలో భాగంగా నాలుగు జిల్లాల్లో నాలుగు మండలాలను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశామని తెలిపారు. జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందించి అందించాలన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ నుంచి కలెక్టర్ వెంకటేశ్ దోత్రే వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు. జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు, భూభారతి చట్టం అమలు, ఇందిరమ్మ ఇళ్ల పథకాలను లక్ష్యాలు సాధించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, డేవిడ్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, ఆర్డీవో లోకేశ్వర్‌రావు, డీపీవో భిక్షపతిగౌడ్, డీఆర్‌డీవో దత్తారావు, గృహనిర్మాణ శాఖ పీడీ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీలతో ఇక్కట్లు!?

• రిలీవ్ కాకుండా విధులకు తహసీల్దార్లు డుమ్మా
• నాలుగు మండలాల్లో నిలిచిన ధ్రువపత్రాల జారీ
• ఎఫ్ఏసీగా ఎవరికీ బాధ్యతలు ఇవ్వని రెవెన్యూ అధికారులు
• సర్టిఫికెట్ల కోసం కార్యాలయాల వద్ద ప్రజల పడిగాపులు
• సోమవారం రాత్రి తహసీల్దార్లను రిలీవ్ చేసిన కలెక్టర్



ఆసిఫాబాద్ మండల కార్యాలయం వద్ద పడిగాపులు కాస్తున్న ప్రజలు

సాక్షి, ఆసిఫాబాద్: జిల్లాలో తహసీల్దార్ల బదిలీలు సామాన్య ప్రజలను ఇక్కట్లకు గురిచేస్తున్నాయి. బదిలీ అయిన తహసీల్దార్లను జిల్లా కలెక్టర్ సోమవారం రాత్రి వరకు రిలీవ్ చేయలేదు. అయితే వారు తమ కార్యాలయాలకు వెళ్లకపోవడంతో పాలనపై ప్రభావం చూపుతోంది. ముఖ్యంగా పాఠశాలలు, కళాశాలలు తెరిచే సమయంలో విద్యార్థులకు కులం, నివాసం, ఈబీసీ, ఓబీసీ ధ్రువపత్రాలు, భూముల లావాదేవీలకు సంబంధించిన రిజిస్ట్రేషన్లు, ఎల్‌టీఆర్, ఇతర పరిశీలన సంబంధిత అంశాలన్నీ ఎక్కడిక్కడ నిలిచిపోయాయి. 13 రోజులుగా ప్రజలు, విద్యార్థులు తహసీల్దార్ కార్యాలయాల వద్ద పడిగాపులు కాస్తున్నారు.

సుముఖత చూపని వైనం..

గత ఎన్నికల సందర్భంగా జిల్లా నుంచి పలువురు తహసీల్దార్లు పొరుగు జిల్లాలకు బదిలీపై వెళ్లిన సంగతి తెలిసిందే. అందులో కొందరు తిరిగి జిల్లాకు రాగా.. మిగిలిన వారు మళ్లీ ఇక్కడ పనిచేయడానికి సుముఖత చూపలేదు. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా తహసీల్దార్లు తమ సొంత జిల్లాలకు బదిలీ చేయాలని ప్రభుత్వానికి విన్నవించడంతో ఈ నెల 15 అందరినీ బదిలీ చేస్తూ రెవెన్యూ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. సిర్పూర్(యూ), కెరమెరి, ఆసిఫాబాద్ మండల తహసీల్దార్లతోపాటు కలెక్టరేట్ ఎన్నికల విభాగంలో పనిచేసే ఒకరు బదిలీ అయ్యారు. వీరి స్థానంలో మరో నలుగురిని ఇక్కడికి కేటాయించారు. ఒకరు మరుసటి రోజే బదిలీ ఉత్తర్వులు రద్దు చేయించుకోగా.. మరో అధికారి సరస్వతీ నది పుష్కర విధుల్లో ఉన్నారు. ఒక అధికారి ఇక్కడ వచ్చి రిపోర్టు చేయకుండా వేచిచూసే ధోరణిలో ఉండగా.. మరొకరు మాత్రం కలెక్టర్ వద్ద రిపోర్ట్ చేశారు.

భారీస్థాయిలో పైరవీలు..

జిల్లాలో ఖాళీ ఏర్పడిన స్థానాల్లో నూతనంగా తహసీల్దార్లను నియమించకపోవడం వెనుక రాజకీయ నేతల ఒత్తిళ్లే కారణమన్న చర్చ జరుగుతోంది. జిల్లాకు వచ్చిన వారికి పోస్టింగ్ ఇచ్చే క్రమంలో ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. కలెక్టరేట్, ఆర్డీవో కార్యాలయాల్లో పనిచేస్తున్న కొందరు ఎగ్జిక్యూటివ్ పోస్టులకు వెళ్లడానికి వివిధ మార్గాల్లో ప్రయత్నాలు చేసుకుంటున్నారు. ప్రస్తుతం బదిలీపై వచ్చిన అధికారులు సైతం కలెక్టరేట్, ఆర్డీవో కార్యాలయాల్లో పనిచేయడానికి ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. అందువల్లే ఇక్కడికి వచ్చి రిపోర్టు చేయడానికి వెనుకంజ వేస్తున్నట్లు సమాచారం. జిల్లా కేంద్రం, ఆదాయ వనరుగా పేరున్న ఆసిఫాబాద్ మండల తహసీల్దారుగా పనిచేయడానికి పలువురు ఆసక్తి చూపుతున్నారు. ఇదే సమయంలో 15 మండలాల్లోని కొన్ని కీలక ప్రాంతాల్లో పనిచేస్తున్న తహసీల్దార్లు తమ సీటుకు ఎక్కడ ముప్పు వస్తుందోనని ముందే స్థానిక ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులను ప్రసన్నం చేసుకుని, కదిలించకుండా చూడాలని కోరుతూ తీవ్రస్థాయిలో ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. కలెక్టర్ సైతం బదిలీల అంశంపై కసరత్తు చేసినట్లు తెలిసింది. జిల్లాలో పనిచేయని తహసీల్దార్లను మార్చాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. నాలుగు మండలాలతోపాటు మరికొన్ని మండలాల్లోనూ తహసీల్దార్లు బదిలీ కావచ్చనే ఊహాగానాలు వెల్లువెత్తుతున్నాయి.

తలచిందొకటి.. జరిగిందొకటి!

కలెక్టర్ బదిలీ అయిన తహసీల్దార్లకు రిలీవింగ్ ఆర్డర్ ఇస్తే.. పరిపాలన పరమైన ఇబ్బందులు తలెత్తుతాయన్న ఉద్దేశంతో వారిని ఆపి ఉంచారు. సదరు అధికారులు మాత్రం 13 రోజుల పాటు విధులకు హాజరు కాకుండా పాలన కుంటుపడేలా చేసి జిల్లా సర్వోన్నతాధికారి ఉద్దేశానికి తూట్లు పొడిచారు. బదిలీ అయిన తహసీల్దార్లు ఎవరూ కార్యాలయాలకు వెళ్లడం లేదని ఉన్నతాధికారులకు సమాచారం ఉన్నప్పటికీ.. వారి స్థానంలో డీటీలకు ఎఫ్ఏసీ ఇవ్వకపోవడంతో పనులు ఆగిపోయాయి. లింగాపూర్, సిర్పూర్(యూ), కెరమెరి, ఆసిఫాబాద్ మండల కార్యాలయాల్లో ధ్రువపత్రాల జారీ ప్రక్రియ నిలిచిపోవడంతో సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. బదిలీల అంశంపై ఉన్నత స్థాయి, రాజకీయ ఒత్తిళ్లు వచ్చిన నేపథ్యంలో సోమవారం రాత్రి హడావుడిగా నలుగురు తహసీల్దార్లను రిలీవ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సమయంలో ఎఫ్ఏసీ అంశాన్ని పరిగణనలోకి తీసుకోలేదని తెలుస్తోంది. కేవలం ఆసిఫాబాద్ మండలానికి మాత్రం డీటీ పోచయ్యకు తహసీల్దార్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. అయితే ఒకటి రెండు రోజుల్లో ఆయా స్థానాల్లో పూర్తిస్థాయి తహసీల్దార్లను నియమించనున్నారని సమాచారం.



ఆసిఫాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో ఖాళీగా కుర్చీ

క్లుప్తంగా

గంజాయి మొక్కలు స్వాధీనం

సిరికొండ: మండలంలోని లక్ష్మీపూర్ శివారులో ఓ రైతు తన చేనులో సాగు చేస్తున్న గంజాయి మొక్కలను ముందస్తు సమాచారం మేరకు మంగళవారం పట్టుకున్నట్లు ఎస్సై శ్రీసాయి తెలిపారు. మొక్కల విలువ సుమారు రూ.50 వేల వరకు ఉంటుందన్నారు. గంజాయి మొక్కలు సాగు చేస్తున్న బోరింగ్ గూడ గ్రామానికి చెందిన రైతుపై విచారణ జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తి రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: ట్రాఫిక్ పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు నమోదు చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపారు. ఈనెల 4న పంజాబ్‌చౌక్‌లో ట్రాఫిక్ పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా బేల మండలంలోని సాంగిడి గ్రామానికి చెందిన సద్దే నితీష్ వారితో వాగ్వివాదానికి దిగాడు. దీంతో ట్రాఫిక్ పోలీసులు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

ఇంజినీరింగ్ కాలేజీలో సీట్లు

శ్రీరాంపూర్: కొత్తగూడెంలోని యూనివర్సిటీ కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ (కేయూ)లో సింగరేణి ఉద్యోగుల పిల్లలకు ప్రత్యేక సీట్లు కేటాయించినట్లు శ్రీరాంపూర్ డీజీఎం (పర్సనల్) అరవిందరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సింగరేణి ఉద్యోగులతో పాటు అధికారుల పిల్లలకు ఇందులో మొత్తం 10 సీట్లు కేటాయించారన్నారు. మైనింగ్ ఇంజినీరింగ్, కంప్యూటర్ సైన్స్, ఐటీ, ఈఈఈ, ఈసీఈలో రెండు చొప్పున సీట్లు కేటాయించినట్లు తెలిపారు. దీనికి గానూ ప్రభుత్వం నిర్వహించిన టీజీ ఈఏపీ సెట్‌లో అర్హత సాధించాలన్నారు. మార్కులు, ర్యాంకుల ఆధారంగా మెరిట్ లిస్టు ప్రకారం సీట్లు కేటాయించబడుతాయన్నారు. మరిన్ని వివరాలకు పర్సనల్ డిపార్టుమెంట్ నందు సంప్రదించాలని ఆయన సూచించారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో కోచ్ రాజేశ్

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలో ఈ నెల 24 నుంచి 26 వరకు నిర్వహించిన రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధించిన మంచిర్యాల ఖేలో ఇండియా బాక్సింగ్ శిక్షణ కేంద్రం క్రీడాకారులు జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు కోచ్ రాజేశ్ తెలిపారు. జూనియర్ గర్ల్స్ విభాగంలో క్రితి అగర్వాల్ (50–52 కేజీలు), జూనియర్ బాయ్స్ కేటగిరీలో (48– 50 కేజీలు) ఎండి ఉబైద్ ఖాన్ జాతీయస్థాయికి ఎంపికయ్యారన్నారు. జూన్ 4 నుంచి 7 వరకు గోవాలో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు.

పెర్సపేన్ ఆలయంపై పిడుగు

ఇంద్రవెల్లి: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో మంగళవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షానికి పొల్లుగూడలో జుగ్నాక్ వంశీయుల కుల దైవమైన (పెర్సపేన్) ఆలయంపై పిడుగు పడింది. దీంతో ఆలయ గోపురం ధ్వంసం కావడమే కాకుండా కలశం ఊడిపోయిందని గ్రామస్తులు తెలిపారు.

వలసదారులూ వెళ్లిపోండి...!

- దేశం విడిచి వెళ్లాలని మలేషియా ప్రభుత్వం ఆంక్షలు
- నిబంధనలకు విరుద్ధంగా ఉంటున్న వారికి క్షమాభిక్ష పథకం అమలు
- ఉమ్మడి జిల్లాలోని వలస కార్మికుల్లో ఆందోళన




మలేషియాలో భారతీయ వలస కార్మికులు (ఫైల్)

నిర్మల్‌ఖిల్లా: బతుకుదెరువుకోసం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి వందలాది మంది కార్మికులు విజిట్ వీసాపై మలేషియా వెళ్లారు. కానీ అక్కడి ప్రభుత్వం వలస కార్మికులను తిరిగి వెళ్లి పోవాలని ఆంక్షలు విధించడంతో ఆందోళన చెందుతున్నారు. వీసా నిబంధనలకు విరుద్ధంగా విజిట్ వీసాపై వచ్చి అక్రమ వలసదారులుగా ఉంటున్న వారిని తక్షణమే స్వదేశాలకు వెళ్లిపోవాలంటూ అక్కడి ప్రభుత్వం తాజాగా 'క్షమాభిక్ష' (ఆమ్నెస్టీ) పథకం అమల్లోకి తెచ్చింది. దీని ప్రకారం మలేషియా దేశంలో పాస్‌పోర్ట్ లేకుండా ఉన్నవారితో పాటు తాత్కాలిక వర్క్ వీసాలు, విజిట్ పర్మిట్ వంటివి గడువు ముగిసినా అక్కడే తలదాచుకుంటున్న వలస కార్మికులు వెళ్లిపోవాలని ఆదేశాలు ఇచ్చింది. క్షమాభిక్ష పథకం ద్వారా తమ స్వదేశాలకు వెళ్లేవారు ఎటువంటి జైలు శిక్ష లేకుండానే 500 రింగిట్లు, మనదేశ కరెన్సీలో రూ.10వేలు జరిమానా చెల్లించి తిరిగి స్వదేశానికి రావాల్సి ఉంటుంది. పాస్‌పోర్టు ఉన్నప్పటికీ, వీసా గడువు ముగిసిన వారితో పాటు, వీసాలు లేని వారందరినీ ఎమర్జెన్సీ ట్రావెల్ సర్టిఫికెట్ ఆధారంగా పక్షం రోజుల్లో రిటర్న్ జర్నీకి అవకాశం కల్పించింది. దీంతో నిబంధనలకు విరుద్ధంగా ఉంటున్న వలసదారులందరూ మలేషియాలోని లాబువాన్ ఇమిగ్రేషన్ ఎన్‌ఫోర్స్‌మెంటు డివిజన్ కార్యాలయాల్లో దరఖాస్తులు సమర్పించాలని సూచించింది.

ఉమ్మడి జిల్లా నుంచి దాదాపు 500 మంది..

నిబంధనలకు విరుద్ధంగా ఉపాధి కోసం మలేషియా వెళ్లిన వారు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి దాదాపు 500 మంది వరకు ఉండవచ్చని ఎన్ఆర్ఐ రాష్ట్ర కమిటీ అడ్వైజరీ మెంబర్ స్వదేశ్ పరికిపండ్ల పేర్కొంటున్నారు. ఉపాధి కోసం పొట్టచేత పట్టుకుని వెళ్లిన వారంతా తాజా నిబంధనలతో స్వస్థలాలకు తిరిగి రావాల్సి ఉంటుందన్నారు. ఉమ్మడి జిల్లాతో పాటు ఉత్తర తెలంగాణలోని ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల నుంచి కూడా వేలాది మంది మలేషియాలో ఉపాధి పొందుతున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి గల్ఫ్ దేశాలైన దుబాయ్, మస్కట్, బహ్రెయిన్, సౌదీ అరేబియా దేశాలతో పాటు మలేషియా కూడా వెళ్తున్నారు. ఈ క్రమంలో మలేషియాలో ఉమ్మడి జిల్లా నుంచి దాదాపు 2,500 మంది వరకు ఉండగా తాజా నిబంధనలతో అందులో 500 మంది స్వదేశాలకు తిరిగి రావాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. దీనికి గడువు 2026, ఏప్రిల్ 30 వరకు నిర్దేశించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలోని వలస కార్మికుల కుటుంబాల్లో ఆందోళనలు నెలకొంటున్నాయి.

నేడు ట్రిపుల్ ఐటీ నోటిఫికేషన్



బాసర ట్రిపుల్‌ఐటీ

- ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్న అధికారులు
- ప్రభుత్వం నుంచి ప్రవేశాలకు గ్రీన్ సిగ్నల్

భైంసా: ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్‌కు సంబంధించి ట్రిపుల్‌ఐటీలో ప్రవేశాలకు బుధవారం నోటిఫికేషన్ విడుదల కానుంది. 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశాల ప్రక్రియపై ట్రిపుల్‌ఐటీ అధికారులు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో నోటిఫికేషన్ విడుదలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. నోటిఫికేషన్‌లో ఆన్‌లైన్ దరఖాస్తు వివరాలు, చివరి తేదీ, కౌన్సిలింగ్ వివరాలు పొందుపర్చనున్నారు. పదోతరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ట్రిపుల్‌ఐటీలో సీట్ల కోసం దరఖాస్తు చేస్తుంటారు.

విద్యా విధానం...

ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సులో తొలి రెండేళ్లు ఇంటర్ సమానమైన పీయూసీ కోర్సు, నాలుగేళ్ల బీటెక్ కోర్సు ఉంటుంది. పీయూసీలో విద్యార్థుల విద్యా విధానం బట్టి బీటెక్‌లో అవకాశాలు వస్తాయి. సివిల్, కెమికల్, కంప్యూటర్, ఎలక్ట్రానిక్స్, ఐటీ, ఈసీసీ, ఎంఎంఈ కోర్సులను ట్రిపుల్‌ఐటీ అందిస్తోంది.

రాష్ట్ర వ్యాప్తంగా పోటీ...

బాసర ట్రిపుల్‌ఐటీలో ప్రవేశం కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఏటా వేల సంఖ్యలో దరఖాస్తులు వస్తున్నాయి. ఈ క్యాంపస్‌లో చదివిన విద్యార్థులు భారీ సంఖ్యలో ఉద్యోగాలు సాధిస్తున్నారు. క్యాంపస్ ప్లేస్‌మెంట్లలో ప్రత్యేక ప్యాకేజీలతో కంపెనీలకు ఎంపికవుతున్నారు. దీంతో పిల్లలను ట్రిపుల్‌ఐటీలో చదివించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ఉత్తమ ప్రతిభ కనబరిచి అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకే ఇక్కడ చదువుకునే అవకాశం దక్కుతుంది.

నేడు నోటిఫికేషన్ విడుదల

ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి ట్రిపుల్ ఐటీలో ప్రవేశానికి బుధవారం నోటిఫికేషన్ విడుదల చేయనున్నాం. ప్రవేశాల కోసం విద్యార్థుల అర్హత, చివరి తేదీతో పాటు పలు వివరాలను నోటిఫికేషన్‌లో వెల్లడించనున్నాం. పదోతరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

– ప్రొఫెసర్ గోవర్ధన్, ట్రిపుల్‌ఐటీ వీసీ

తీర్థయాత్రలకు ప్రత్యేక రైళ్లు



కిశోర్

ఆదిలాబాద్: తీర్థయాత్రలకు వెళ్లాలనుకునే ప్రయాణికుల కోసం జూన్ 14 నుంచి జూలై 13 వరకు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు ఐఆర్‌సీటీసీ టూరిజం జాయింట్ జనరల్ మేనేజర్ కిషోర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాశీ, అయోధ్య, నైమిశారణ్యం, ప్రయాగ్ రాజ్, శృంగ్వార్‌పూర్ ప్రాంతాలు సందర్శించాలనుకునే వారికి గంగా రామాయణ పుణ్యక్షేత్ర ప్యాకేజీ అందుబాటులో ఉందన్నారు. ఉజ్జయిని, త్రయంబకేశ్వర్, మహాకాళేశ్వర్ వంటి ఐదు జ్యోతిర్లింగాలను దర్శించాలనుకునే ప్రయాణికులకు మరో ప్యాకేజీ అందుబాటులో ఉందని తెలిపారు. ఈ ప్రత్యేక రైళ్లలో ఎన్నో సౌకర్యాలు ఉంటాయన్నారు. ఆసక్తి కలవారు www. irctctourism.com వెబ్‌సైట్ ద్వారా టికెట్లు బుక్ చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 9281030712, 9701360701, 9281495845, 9281030749, 9281030750 నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

'నకిలీ ఇన్సూరెన్స్ కంపెనీలతో అప్రమత్తంగా ఉండాలి'

ఆదిలాబాద్‌టౌన్: నకిలీ ఇన్సూరెన్స్ కంపెనీలతో అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి అన్నారు. పట్టణంలో యూనిక్ మరకన్‌టైల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఇన్సూరెన్స్ కంపెనీ బాధితుల ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మంగళవారం డీఎస్పీ ఘటనకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. హౌజింగ్‌బోర్డు కాలనీకి చెందిన బాకే సరిత, దస్నాపూర్‌కు చెందిన అరక అశోక్ సదరు కంపెనీకి దాదాపు రూ.5లక్షల వరకు ఇన్సురెన్స్ చెల్లించారన్నారు. ఇన్సూరెన్స్ పూర్తయినా సదరు ఏజెంట్లు డబ్బులు ఇవ్వకుండా వారికి సమాధానం చెప్పడం లేదన్నారు. దీంతో సంజయ్‌నగర్‌కు చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు సేవసింగ్, అతని భార్యపై కేసు నమోదు చేసినట్లు వివరించారు. ఇన్సూరెన్స్ రెగ్యులారిటీ డెవలప్‌మెంట్ అథారిటీ ద్వారా ఆమోదించబడిన వాటిలో మాత్రమే ఇన్సూరెన్స్ చేయించుకోవాలని సూచించారు.

భార్య ఆత్మహత్యకు కారణమైన భర్తకు పదేళ్ల జైలు

ఆదిలాబాద్‌టౌన్: అనుమానంతో భార్యను మానసికంగా వేధించి ఆమె ఆత్మహత్యకు కారణమైన భర్తకు పదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.10వేల జరిమానా విధిస్తూ జిల్లా అసిస్టెంట్ సెషన్స్ జడ్జి రాజ్యలక్ష్మి మంగళవారం తీర్పునిచ్చినట్లు లైజన్ అధికారి వెంకటమ్మ తెలిపారు. బేల మండలంలోని సిర్సన్న గ్రామానికి చెందిన దండెపల్లి నర్సయ్యకు దేవతతో 2003లో వివాహమైంది. 2013లో కుమారుడు జన్మించగా తనకు పుట్టలేదని భార్యను వేధించేవాడు. నిత్యం మద్యం సేవించి ఇంటికి వచ్చి ఇబ్బందులకు గురిచేసేవాడు. దీంతో అతని భార్య 2019 అక్టోబర్ 18న ఒంటిపై కిరోసిన్ పోసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తండ్రి దేవన్న ఫిర్యాదు మేరకు బేల పోలీసు స్టేషన్‌లో అప్పటి ఎస్సై కేసు నమోదు చేశారు. సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా పీపీ షాహీన్ సుల్తానా నేరం రుజువు చేశారు.

పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య



నారాయణ (ఫైల్)

తాంసి: మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని కప్పర్లకు చెందిన అనుప నారాయణ (32) వ్యవసాయకూలీగా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. మంగళవారం ఉదయం మద్యం సేవించి పంటచేనుకు వెళ్లాడు. మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంటున్నానని చేను యజమానికి సమాచారం ఇచ్చాడు. యజమాని చేను వద్దకు వెళ్లేసరికి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. వెంటనే అంబులెన్సులో రిమ్స్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుని భార్య అపర్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఇన్‌చార్జి ఎస్సై రాధిక తెలిపారు.

వివాహం కావడంలేదని యువకుడు..



సుదర్శన్ (ఫైల్)

సోన్: వివాహం కావడంలేదని మనస్తాపంతో ఉరేసుకుని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు మండల కేంద్రానికి చెందిన గోలి సుదర్శన్ (31) ఆరునెలల క్రితం విదేశాల నుంచి తిరిగి వచ్చాడు. తనకు వివాహం కావడంలేదని మనస్తాపంతో మద్యానికి బానిసయ్యాడు. మంగళవారం ఉదయం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై కె.గోపి తెలిపారు.

ఉద్యోగం ఇప్పిస్తానని మోసగించిన వ్యక్తిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని ఖానాపూర్‌కు చెందిన జావిద్ ఖాన్‌పై మంగళవారం కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. పట్టణానికి చెందిన అబ్దుల్ అజీజ్ ఇద్దరు కుమారులకు కాంట్రాక్ట్ పద్ధతిలో తహసీల్దార్ కార్యాలయంలో, సిటీ యూనియన్ బ్యాంక్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించాడు. వారి వద్ద నుంచి రూ.2లక్షల చొప్పున రూ.4లక్షలు తీసుకున్నాడు. ఉద్యోగం ఇప్పించకపోగా తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వలేదు. డబ్బులు అడిగితే చంపుతానని బెదిరింపులకు పాల్పడ్డాడు. బాధితులు వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు వివరించారు.

ద్విచక్ర వాహనం చోరీ

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని రవీంద్రనగర్‌కు చెందిన దార్ల అశోక్ ద్విచక్ర వాహనం మంగళవారం చోరీకి గురైంది. తన ఇంటి ముందు పార్కింగ్ చేసిన వాహనం కనిపించకుండా పోయింది. చుట్టుపక్కల గాలించినా ఆచూకీ లభించకపోవడంతో వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సునీల్ కుమార్ తెలిపారు.

సమయానికి రారు.. పట్టించుకోరు!



హాజీపూర్ పీహెచ్‌సీ లోపల ఖాళీగా దర్శనమిస్తున్న వైనం



పీహెచ్‌సీ ఎదుట ఎదురు చూస్తున్న రోగులు

హాజీపూర్ పీహెచ్‌సీ సిబ్బంది సమయానికి రాకపోవడంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు. వైద్యుల కోసం గంటల కొద్దీ నిరీక్షించాల్సి వస్తోందని రోగులు వాపోతున్నారు. ఉదయం సమయానికే తాళాలు తీసినా.. సిబ్బంది మాత్రం సమయం దాటాకే వస్తున్నారని, సాయంత్రం కూడా సమయం కాకముందే తాళం వేసి ఎంచక్కా వెళ్లిపోతున్నారని ఆరోపించారు. సంబంధిత శాఖ అధికారులు దృష్టి సారించి వైద్య సిబ్బంది సమయపాలన పాటించేలా, మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

– మంచిర్యాలరూరల్(హాజీపూర్)

నలభీములకు c/o కుభీర్

- మండల కేంద్రంలో 20 బృందాలు
- ఏడాది పొడవునా చేతినిండా పని
- జిల్లాతో పాటు మహారాష్ట్రలోనూ వంటల తయారీ



వంట చేస్తున్న వంటాచార్యుడు

కుభీర్: నిర్మల్ జిల్లాలోని కుభీర్ నలభీములకు (వంట మనుషులకు) ప్రసిద్ధి గాంచింది. మండల కేంద్రంలో సుమారు 20 బృందాలు ఉన్నాయి. ఒక్కో బృందంలో ఒక మాస్టారు, ఇద్దరు లేదా ముగ్గురు సహాయకులు ఉంటారు. అంతేకాకుండా కూరగాయలు కోయడానికి, చపాతీ, పూరీ, లడ్డూ, బాదుషా తయారు చేయడానికి మహిళలను కూలీకి మాట్లాడుకుని వెంట తీసుకెళ్తారు. జిల్లాలోని వివిధ గ్రామాలతో పాటు మహారాష్ట్రలోని పలు గ్రామాలకు వంటలు చేయడానికి వెళ్తారు. ఒక్కో శుభకార్యానికి మనుషుల లెక్కన రూ.8 వేల నుంచి రూ.30 వేల వరకు తీసుకుంటారు.

ఏడాది పొడవునా పని..

కుభీర్‌కు చెందిన సుమారు 100 మంది మహిళలు, పురుషులకు ఈ రంగంలో ఏడాది పొడవునా ఉపాధి లభిస్తోంది. వెజ్, నాన్‌వెజ్‌తో పాటు లడ్డూ, బాదుషా, జిలేబీ, కాకినాడ కాజా, చపాతీ, పూరీ, మజ్జిగ, కార, బూంది, పాపడాలు, అన్నం, పప్పు, కూరగాయలు.. ఇలా అన్నిరకాల వంటలు చేస్తారు. నాన్‌వెజ్‌లో చికెన్ బిర్యానీ, మటన్ బిర్యానీ, చేపల ఫ్రై, బోటి.. ఇలా అన్నిరకాల వంటలు చేస్తారు. ఇంట్లో శుభకార్యం ఉన్నవారు రెండు నెలల ముందుగానే ఆర్డర్ ఇచ్చి బుక్ చేసుకుంటారు. వారి వద్ద వంటకు సంబంధించిన కొన్ని పాత్రలు మాత్రమే ఉన్నాయి. ప్రభుత్వం ఆర్థికసాయం అందిస్తే మరిన్ని పాత్రలు కొనుగోలు చేసుకోవడంతో పాటు మరికొంత మందికి ఉపాధి లభిస్తుందని వారు పేర్కొంటున్నారు.

ప్రధాన వంటాచార్యులు వీరే

కుభీర్‌కు చెందిన ప్రధాన వంటాచార్యులు ఆరె లక్ష్మణ్, కందూర్ పోతన్న, పెద్ద పోతన్న, బత్తిని సాయన్న, మధు, కిని సంతోష్, బ్రాహ్మణ్ శేఖర్, బ్రాహ్మణ్ శేషు, జరి ముత్యం, సిద్దూర్ పోతన్న, పోతాజీ, సాకలి రాందాస్, కొబ్బాజి పోతన్న, బంక బాబు, బ్రాహ్మణ్ రాజు, చవాన్ విశ్వనాథ్, అడెల్లు, సాయినాథ్, గంగాధర్ ఉన్నారు.

చేతినిండా పని



మాకు ఏడాది పొడవునా చేతినిండా పని ఉంటుంది. ఎండాకాలంలో పెళ్లిళ్లు ఎక్కువగా ఉంటాయి. వర్షాకాలం, చలికాలంలోనూ చిన్నచిన్న శుభకార్యాలు ఉంటాయి. నావద్ద ముగ్గురు అనుచరులు ఉన్నారు. అవసరమైనప్పుడు మహిళా కూలీలను కూడా తీసుకుంటాను.

– బ్రాహ్మణ్ శేఖర్, వంటాచార్యుడు, కుభీర్

ప్రభుత్వం ప్రోత్సహించాలి



నేను 20 ఏళ్లుగా వంటలు చేస్తున్నా. ప్రభుత్వం ప్రోత్సాహం అందించి ఆర్థికసాయం అందిస్తే మరిన్ని వంటపాత్రలు కొనుగోలు చేసి మరికొందరికి ఉపాధి కల్పిస్తా.

– ఆరె లక్ష్మణ్, వంటాచార్యుడు, కుభీర్

బాసర ఆలయ హుండీ లెక్కింపు



లెక్కిస్తున్న సేవా సమితి సిబ్బంది

బాసర: బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి 60 రోజుల హుండీ ఆదాయాన్ని మంగళవారం అక్షరాభ్యాస మండపంలో లెక్కించారు. రూ.77,77,746 నగదు, 126 గ్రాముల మిశ్రమ బంగారం, మూడు కిలోల 440 గ్రాముల మిశ్రమ వెండి, 17 విదేశీ కరెన్సీ వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి సుధాకర్‌రెడ్డి తెలిపారు.

బాక్సింగ్ కమిటీ ఎన్నిక

శ్రీరాంపూర్: ఉమ్మడి జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ నూతన కమిటీని మంగళవారం హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన సమావేశంలో ఎన్నుకున్నట్లు అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనుంజయ్‌గౌడ్ తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా ఆరుమల్ల రాజు, ప్రధాన కార్యదర్శి కే.దేవేందర్‌ను ఎన్నుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ప్రయాణికురాలి బ్యాగ్ నుంచి నగదు అపహరణ



బస్సు వద్ద నిరీక్షిస్తున్న ప్రయాణికులు

రెబ్బెన: ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ఓ మహిళా ప్రయాణికురాలి హ్యాండ్‌బ్యాగ్‌లో నుంచి నగదు అపహరించిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాల మేరకు చింతలమానెపల్లి చెందిన మహిళ మంగళవారం రెబ్బెన మండలంలోని కాగజ్‌నగర్ ఎక్స్‌రోడ్ వరకు వచ్చింది. అక్కడి నుండి మంచిర్యాల వెళ్లేందుకు ఆర్టీసీ బస్సు ఎక్కింది. అయితే కండక్టర్‌కు చూపించేందుకు తన హ్యాండ్‌బ్యాగ్‌లో ఉన్న ఆధార్‌కార్డును తీసేందుకు బ్యాగు తెరవగా అందులో ఉన్న రూ.15వేలు కనిపించలేదు. దీంతో బస్సును దేవుల గూడ వద్ద ఆపి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీస్ సిబ్బంది బస్సులో ఉన్న ప్రయాణికులందరి బ్యాగులను తనిఖీ చేసినా డబ్బులు లభించలేదు. అయితే రెబ్బెన బస్‌స్టాప్‌లో కొంతమంది ప్రయాణికులు బస్సు దిగిపోయారని, వారిలోనే డబ్బులను చోరీ చేసిన వారు ఉండి ఉంటారని పోలీసులు భావించారు. ఘటనతో మంచిర్యాలకు వెళ్లే ప్రయాణికులు సుమారు 1:15 గంటల పాటు నిరీక్షించాల్సి వచ్చింది. ఈ విషయమై ఎస్సై చంద్రశేఖర్‌ను వివరణ కోరగా ఘటనపై బాధితురాలు ఎలాంటి ఫిర్యాదు చేయలేదన్నారు.

క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు



పోటీలు ప్రారంభిస్తున్న నిర్వాహకులు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో ఈనెల 18న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా క్రికెట్ అసోసియేషన్, హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్–25 జిల్లా ఎంపిక పోటీలు నిర్వహించారు. 200ల మంది క్రీడాకారులు పాల్గొనగా 90 మందిని ఎంపిక చేసి ఆరు టీంలుగా విభజించారు. ప్రతీ టీంను మిగిలిన అన్ని టీంలతో రెండు రోజుల పాటు ఆడించాలని భావించగా వర్షంతో వాయిదా పడింది. మంగళవారం జిల్లాలోని మూడు మైదానాల్లో ఎంపిక పోటీలు నిర్వహించినట్లు హెచ్‌సీఎల్ సెక్రటరీ కోదాటి ప్రదీప్, కోచ్ పి.ప్రదీప్ తెలిపారు. మంచిర్యాలలోని ఉషోదయ పాఠశాల, గుడిపేట 13వ పోలీసు బెటాలియన్ మైదానం, మందమర్రిలోని సింగరేణి మైదానంలో క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఆరు టీంలలో ప్రతిభ కనబర్చిన వారిని ఒక టీంగా చేసి, వారిని ఉమ్మడి జిల్లా నుంచి రాష్ట్రస్థాయిలో నిర్వహించే పోటీలకు పంపించనున్నట్లు తెలిపారు.

తుర్కం చెరువును సందర్శించిన ట్రైనీ అటవీ అధికారులు



తుర్కం చెరువు వద్ద ట్రైనీ ఫారెస్ట్ బీట్ అధికారులు

మామడ: మండలంలోని ఎకో టూరిజం సందర్శన కేంద్రం అయిన తుర్కం చెరువును ట్రైనీ అటవీ అధికారులు శిక్షణలో భాగంగా మంగళవారం సందర్శించారు. హైదరాబాద్ నుంచి వచ్చిన 42 మంది ట్రైనీ బీట్ అధికారులు తుర్కం చెరువుతోపాటు యెంగన్న చెరువు వద్ద వలస పక్షులను ప్రత్యేక కెమెరాలతో వీక్షించారు. చెరువులకు వస్తున్న పక్షుల రకాల గురించి స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. అడవిలో పెరుగుతున్న మొక్కల రకాలను తెలుసుకున్నారు. వారివెంట ఎఫ్ఆర్వోలు శ్రీనివాస్‌రావు, స్వరూప, ఎఫ్ఎస్‌వో శ్రీనివాస్, పీడీ కొండల్‌రావు ఉన్నారు.